

# ఇదిగో భద్రాద్రీ గౌతమి అదిగో చూడండి!

## ముదముతో సీతాముదిత లక్ష్మణులు కలసికొలువగా రఘుపతియుండెడి ఇదిగో భద్రగిరి రామభద్రుని చూడండి!

## ధ్యాయే భద్రాద్రి వైకుంఠరామం సీతారమాన్వితమే శంఖు చక్రధనుర్బాణధరం సౌమిత్రీ సేవితమ్!

ఈ వ్యాసం ప్రచురించడంలోనూ, మరల రెండో నెల ముఖపత్రంగా భద్రాది సీతారామ లక్ష్మణుల ముఖపత్రం ముద్రించడం, శ్రీసీతారామచంద్రులను గూర్చి ముచ్చటించే విశేషమేమని పఠితలందరికీ భావం స్ఫురించవచ్చు. త్రేతాయుగంలోనే శ్రీరామచంద్రుడు అయోధ్యా నగర మందు జన్మించి, నూనూగుమీసాలు మొలవక ముందే విశ్వామిత్ర మహర్షి యాగసంరక్షణార్థం దండకారణ్యం వెళ్ళడం–తాటక, సుబాహులను వధించడం, జనక సుత సీతను పెండియాడడం, తిరిగి అయోధ్య రావడం, పట్టాభిషేక భంగం, మరల సీతా, లక్ష్మణ సమేతుడై మరల పదునాలుగు సంవత్సరాలు అరణ్యావాసం చేయడం, మునుల కోరికపై దండకారణ్యంలోకల పదునాలుగు వేలమంది రాక్షసులను సంహరించడం, సీతాపహరణం, ఆంజనేయ పరిచయం సుగ్రీవ స్నేహం, వాలివధ, రావణ సంహారం, విభీషణ పట్టాభిషేకం జరిపి పదు నాలుగు సంవత్సరాలు అరణ్యావాసం పూర్తిచేసుకుని, అయోధ్యకు రావడం, శ్రీరామ పట్టాభిషేకం, ధర్మపరంగా పదకొండువేలమంది అయోధ్యకు రావడం, శ్రీరామపట్టాభిషేకం, ధర్మపరంగా పదకొండువేల సంవత్సరాలు రాముడు రాజ్యం ఏలడం, కుశలవుల జననం, శ్రీరామప్రస్థాన సందర్భంలో సరయూ నదిలో వెడుతూ వెడుతూ రామావతార సమాప్తం చేయడం సర్వ విశ్వజనులూ యెఱింగినదే! అనేక రామాయణ గ్రంథములు, అనేక దేశ భాషల్లో ప్రచురింప బడడం, వాల్మీకి రామాయణం ఆదికావ్యంగా పూజింపబడడం సర్వజన విదితమే. రాముడు వైకుంఠమేగి విష్ణుమూర్తిగా వెలయడంతో రామాయణచరితం ముగిసింది.

అటుపిమ్మట ద్వాపరయుగంలో ఆనందమూర్తిగా, అసురసంహారిగా భగవద్గీతాచార్యునిగా కృష్ణావతారం అవతరించింది. ఇదొక చిత్ర అవతారం పసితనం నుంచీ రాక్షస సంహారం చేసి, వయసు వచ్చిన తరువాత గోవులూ, గోపబాలురతో వినోదాలూ, గోపకన్యలతో రాసకేళీ విలాసాలు కురుక్షేత్ర సంగ్రామంలో రథ సారధ్యం, ధర్మ (గీతా) బోధను విశ్వరూప దర్శనంతో అవతారం ఆనందప్రదంగా జరిగి పోయింది. దుష్టశిక్షణ శిష్టరక్షణ ప్రాతిపదిగా సంపూర్ణావతారం. కృష్ణావతారం కూడా ముగిసింది.

ఇన్ని వేల లక్షల వత్సరాలయిన తరువాత కలియుగం రావడం కలిమాయ, కలిఘోరాల్నుంచీ బయటపడవేయడానికి వాగ్గేయకారులు ఆంధ్రా నలు ప్రాంతాల్లోనూ అవతరించారు. భక్తితో భగవత్ద్బంధం ఏర్పరచుకోవడానికి సంకీర్తన ప్రారంభమైంది. నాకు ఫలము, పుష్పము, తోయముల దోసిటి పోయకపోయిన నామ సంకీర్తనమొకటే చాలు నన్న భగవద్భక్తి లోక వెలుగుగా వర్ధిల్లింది.

కోటి సంవత్సరాల క్రితం అవతారం ముగించిన శ్రీరామనామం తారకమంత్రమైంది. అందుకే రామదాసు తారకమంత్రం కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా – అంటూ రామభక్తి సాగరంలో మునిగిపోయాడు.

భద్రాచలంలో ఉన్నట్లు సీతా రామలక్ష్మణుల దివ్య సుందర విగ్రహాల్ను వేఱే ఏ రామాలయంలోనూ దర్శింపజాలం. ఇక్కడి శ్రీరామవిభుడు శంఖ చక్ర ధనుర్బాణాలను ధరించి, సుఖాసీనుడై సీతా మహాలక్ష్మిని వామాంకమున కూర్చోపెట్టుకుని, ప్రక్కన నిలబడిన లక్ష్మణునితో సేవలందుతూ భద్రగిరి శిఖరముపై వెలసి యున్నాడు.

**'భద్రాద్రి నిలయం రామం సత్వాపాపైః ప్రముచ్యతే'**



భద్రాచలంలోని సీతా రాముల లక్ష్మణులను సేవించి తరించినవారు సకల పాపవిముక్తులై తరిస్తారని బ్రహ్మపురాణం వచిస్తోంది. భద్రాచలం క్షేత్రంలో జరిగినట్లు సీతారామ కల్యాణం భరతభువిపై యెక్కడా జరుగదు. కళ్ళారా చూడాలి, మనసారా ఆనందించాలి. పెనంమీద అట్టు వేగినట్లుగ ఇక్కడ సూర్యతాపం అగ్నిజ్వాలలు కురిపిస్తూన్నా జనం తండోపతండాలుగా కుటుంబ సమేతులై వస్తారు. అభిజిత్ లగ్నంలో మధ్యాహ్నం పన్నెండు గంటలకు మిట్ట మధ్యాహ్నపు సూర్యుడు అట్టహాసం చేస్తూన్నప్పుడు (ఆయనకూ చూడాలని ఉంటూందిగా) శ్రీరాముడు సీతా మహాలక్ష్మి శిరస్సుమీద జీలకర్ర బెల్లం ముద్దనుంచుతాడు. అంతే సూర్యుడుండ గానే వరుణుడు మేఘ సమూహంతో వచ్చి ముత్యా లలా వర్షం కురిపిస్తాడు. భద్రాద్రిలో కల్యాణం జరిగిన సమయంలో వర్షం హర్షంతో కురిసితీరాలి. పైనుంచీ ముక్కోటి దేవతలూ, దృశ్యా దృశ్యంగా జనక మహారాజు దశరథ మహా రాజులు అదృశ్యంగా ఉంటారని జన విశ్వాసం.

**జానక్యాః**
**కమలామలాంజలిపుటేయా**
**పద్మరాగయితా**
**న్యస్తాః శ్యామల**
**కాయకాంతి కలితాః యా**
**ఇంద్రనీలాయితా**
**న్యస్తాః రాఘవ మస్తకేచ విలసిత్కున్ద ప్రసూనాయతాః**
**ముక్తాస్సాశ్శుభదా భవంతు భవతాం శ్రీరామవైవాహికాః**

సీతమ్మ తల్లీ! ఎంత ముచ్చటగా దోసిటపట్టి రామయ్య శిరముపై ముత్యాలు పోసావమ్మా! తలంబ్రాల సమయంలో ఆ ముత్యాలు పద్మం వంటి నీ చేతుల్లో

(తరువాయి 16వ పేజీలో)

### భద్రాద్రి రఘురామ భజనకు జనుచుండ- బంధుమిత్రుల ఆజ్ఞ బడయనేల!

అవతార సమాప్తి అయిననూ తనకు తానుగా శ్రీరామవతారందాల్చి కారాగారంలో ఉన్న కంచర్ల గోపన్న కారాగార విముక్తుణ్ణి కావించడానికి రామన్న, లక్ష్మణ్ణ రూపములో గోపన్న సేవకులమంటూ గోల్కొండ చక్రవర్తి తానీషాకు గోపన్న వాడిన సర్కారు ఋణము తీర్చి, **రామదాసుగారూ! రండీ! రశీదు అందుకోండీ'** అంటూ రామన్న, లక్ష్మణ రూపంలో దర్శనమిచ్చి, తానీషా యిచ్చిన రశీదునిచ్చి – భక్తుని కోరికపై భద్రగిరిపై వెలసిన భద్రగిరి దాశరథి ఎంతటి భక్తజన ప్రియుడండీ! సత్య, ధర్మ గరిష్ఠానిష్ఠుడు ఏకపత్నీవ్రతుడు. పూర్వ రఘువంశీయ రాజులు చేసినట్టు, తాను అశ్వమేధం వంటి మహత్తర యాగములొనర్చినవాడు. ధర్మ ప్రజాపాలనం చేసి, రాజ్యం పుత్రులకప్పగించి, అన్ని బంధములు విడిచి, సరయూ నదిలో వెడుతూ వెడుతూ అవతార సమాప్తి గావించి, వైకుంఠమున యధాస్థానమున వైకుంఠ పాలకునిగా భక్తులను బ్రోచుతూ, ఉన్నవాడు భద్రుని ప్రార్ధనను మన్నించి, భద్రగిరిపై తిరిగి ప్రత్యక్షమై, ఆర్చారూపమున వెలసి ఉన్న ఆ శ్రీరామచంద్రుని భద్రగిరి అవతారిక గొప్పదే కాదు, పురాణంలో ఏ అవతారమూ ప్రసాదించని అవకాశం భక్తులకు కల్గించిన అవతారుడు భద్రగిరి దాశరధీశుడు! దాశరధీ కరుణాపయోనిధియన్న 'ప్రియ పిలుపు నందే భద్రాచలం దక్షిణాది అయోధ్య అని ఋజూ అవుతున్నది..